# మంటలు



## సి. ఆనందారామం

"మంటలు! హమ్మబాబోయ్ మంటలు! కాలిపోతున్నాను! కాల్చేస్తున్నాయి! ఎఱ్ఱగా నాలుకలు జాపి నన్ను మింగేస్తున్నాయి. కాపాడండి నాయనోయ్! నన్ను చంపెయ్యకండి దేవుడోయ్!"

అరుపులు! గోల! గందరగోళం! ఆ హడావుడికి కళ్ళు నులుపుకుంటూ లేచాడు డెప్యూటీ జైలర్ శివరాం! ఆ కేకలు వినగానే అతనికి విషయం

అర్థమయిపోయింది. ఖైదీ నం. 117 చేస్తున్న గొడవది! వారానికి అయిదు రోజులైనా, ఆ రకంగా గొడవ చెయ్యటం అతనికి అలవాటే! అది మౌలాలీ ప్రాంతంలో ఉన్న ఓపెన్ జైలు! హత్యల వంటి నేరాల వల్ల దీర్ఘకాలిక శిక్షపడిన ఖైదీలలో కొందరిని అక్కడ చేర్చి ప్రయోగాత్మకంగా నడుపుతున్నారు. జంటనగరాలకు దూరంగా ఉన్న అడవి ప్రాంతం అది – ఖైదీలే దానిని దున్ని సస్యశ్యామలం చేసారు. ఒక డైరీఫాం కూడా నిర్వహిస్తున్నారు– పగలంతా వొళ్ళు విరుచుకుని శ్రమపడ్డ ఆ ఖైదీలు రాత్రి కాగానే వొళ్ళుమరచి నిద్రపోతారు, సాధారణంగా – కానీ ఈ ఖైదీ నం. 117 మాత్రం నిద్రపోడు – కన్ను మూసాడంటే, అతనికి కలలొస్తాయి! ఆ కలల్లో మంటలు ఎట్లాగా భయంకరంగా నాలుకలు జాపుతూ అతడిని కబళించటానికి మీద మీదకు వస్తాయి! ఆ మంటల నుంచి అతనికి విముక్తిలేదు! ఉండదు! ఏదో ఒక నాటికి అతనికి జైలు నుంచయినా విముక్తి ఉంటుందేమో కాని, ఆ కలల్లోంచీ మాత్రం విముక్తి ఉండదు.

ఖైదీ నం.117, చదువూ సంస్కారం లేనివాడు కాడు. మంచి ఇంజనీరు! అక్కడి బోరింగు పంపులన్నీ అతడే నిర్మింపచేసాడు. డెప్యూటీ జైలర్‌కి ఆఫీస్ వ్యవహారాల నిర్వహణలో క్లర్కులాగ తోడ్పడుతుంటాడు–మంచి సంస్కారం కలవాడు. అయినా అతనికి ఆ మంటల బారినుంచి రక్షణ లేదు – మొగవారిలో ఈ చదువూ, సంస్కారం, సభ్యతా, ఇవన్నీ ఆడదాని విషయం వచ్చేసరికి ఏమయిపోతాయో!

ఆ నాటి రంగనాయకి కంఠం — ఆ మాటలు శివరాం ఏనాటికీ మరిచిపోలేడు.

“ఇతడే! ఇతడే నన్ను కాల్చి చంపాడు! నన్ను ప్రేమించాడు! ప్రేమించి ఆ ప్రేమ భరించలేక అతిప్రేమతో కాల్చి చంపాడు. వాళ్ళకు చెప్పండి! అందరికీ చెప్పండి! ఆ జీవితమే నయమని చెప్పండి? అదే హాయిగా ఉంటుందని చెప్పండి! ఛీ! ఛీ! ఇది మానవ సమాజమా? ఇంతకంటే కీకారణ్యం మేలు! అక్కడి పులులూ, సింహాలూ మేలు! అవి శరీరాన్నే మింగుతాయి! వీళ్ళు.... ఈ మనుష్యులు మనసుల్ని.... ఆత్మల్ని.... నమిలి నమిలి మింగుతారు. ఇతడే!.... వీడే.... ఈ దుర్మార్గుడే... నా మీద కిరసనాయిలు పోసి నిలువునా కాల్చాడు! వీడిని కూడా అలాగే కాల్చండి – అప్పుడు ఇద్దరం 'ప్రేమలో' ఏకమవుతాం....”

హాస్పిటల్‌లో చావుబ్రతుకుల మధ్య ఉన్న రంగనాయకి మరణవాఙ్మూలాన్ని రికార్డ్ చేసారు. ఆ రికార్డ్ చాలాసార్లు విన్నాడు శివరాం! అది అతని చెవుల్లో గింగురుమంటూనే ఉంది.

తరువాత విచారణలో అనేక విషయాలు వెల్లడయి రంగనాయకి కథ అందరికీ తెలిసింది.

* * *

“నువ్వు ఎవరో పెద్దింటి పిల్లలా ఉంటావు. ఇక్కడికెలా వచ్చావో గాని”

రంగనాయకి చెక్కిళ్ళు ప్రేమగా నిమురుతూ అన్నాడు శ్రీనాథ్ – అతడెప్పుడూ అలాగే అంటాడు. అతడు అలా అన్నప్పుడల్లా రంగనాయకి నవ్వుతుంది – పైకి నవ్వుతుంది కానీ, లోలోపల మథన పడుతుంది.... ఒక పసిపాప.... రెక్కలగౌను, బాబ్డ్ హెయిర్ మెడలో సన్నని గొలుసు.... అన్నం తిననని పేచీ పెడుతూంటే, ఎవరో పెద్దావిడ, బతిమాలి, బుజ్జగించి తినిపిస్తుంది. సన్నగా, పొడుగ్గా ఉండే ఒకాయన ఏవో, బొమ్మలు తెచ్చి ఇస్తున్నారు. వీధిలో ఏవో పగటి వేషాలు తాలూకుడప్పులు! కాంపౌండ్ గేట్‌కున్న చిన్న తలుపులోంచి బయట కొచ్చేసింది! ఏవేవో వీధులు! అంధకారం! అంధకారం! అంధకారం!

శరీరం జలదరించింది – శ్రీనాథ్ ఆశ్చర్యంగా చూసి, “ఇదేమిటి? ఎందుకు భయపడుతున్నావ్?” అన్నాడు. రంగనాయకి నవ్వి “ఏం లేదు–” అంది. ఏం చెప్పగలదు మరి? చీటికీ మాటికీ తన మనసులోకి లీలగా వచ్చే ఆ దృశ్యాలు ఏమిటో తనకే తెలియదు. ఆ పసిపిల్ల తను అవునో కాదో కూడా తెలియదు. అదంతా కేవలం తన భ్రమ అవునో కాదో కూడా చెప్పలేదు– తనకు గుర్తున్నదంతా అంధకారం మాత్రమే! గాఢాంధకారం! ఆ అంధకారంలోంచి కళ్ళు విప్పినప్పటినుంచీ ఇక్కడే ఉంది.

నాగమణి కంపెనీకి చాలా మంచి పేరు ఉంది. ఆవిడ తన కంపెనీలోకి అమ్మాయిలను ఎలా చేర్చుకుంటుందో, ఆ రహస్యమయితే ఎవరికీ తెలియదు కానీ, ఆవిడ వాళ్ళందరినీ చాలా బాగా చూసుకుంటుందని మాత్రం అందరికీ తెలుసు – ఆవిడ వాళ్ళను మంచి పోషణలో పెంచుతుంది–సంస్కారంగా, నవనాగరికంగా కనపడటానికి వీలయినంతవరకూ చదువు చెప్పిస్తుంది – అభిరుచి ఉన్నవాళ్ళకి సంగీతమూ, నాట్యమూ కూడా నేర్పిస్తుంది. పదిహేను రోజుల కొకసారి డాక్టర్ వచ్చి అందరినీ పరీక్ష చేస్తాడు– అందుచేత డబ్బు ఎక్కువ ఇచ్చుకోవలసి వచ్చినా అందరూ, ముఖ్యంగా “హైక్లాసు”వాళ్ళు అక్కడికే వెళ్తారు – అలాగే వచ్చాడు, శ్రీనాథ్ రంగనాయకి దగ్గరికి.

“రంగా! నిన్ను నేను నిజంగా ప్రేమిస్తున్నాను” అన్నాడు శ్రీనాథ్–

ఈ డైలాగ్ రంగనాయకికి బాగా

అలవాటు - వెంటనే తనకు బాగా అలవాటైన సమాధానం చెప్పేసింది.

"నేను మాత్రం! మీరు వెళ్ళినప్పటి నుండీ మళ్ళీ వచ్చేవరకూ, మీకోసమే ఎదురుచూస్తుంటాను-"

ఎంతో ప్రేమ చూపిస్తూ ఈ మాట లంటున్నప్పుడు రంగనాయకి ఎప్పుడూ తనలో తను నవ్వుకుంటుంది. ఆ నవ్వు అప్పటి తన ప్రియుడు చూడకుండా అతడి గుండెల్లోనే, తన ముఖం దాచేసుకుంటుంది. మరింత ప్రేమ చూపిస్తున్నట్లు-

"రంగా! నువ్వు మరొకరి దగ్గరి కెళ్ళటం, మరొకరితో ఉండటం నేను సహించలేకపోతున్నాను-"

"ఈ డైలాగు రంగనాయకికి కొత్తది. అంచేత ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూసింది. అతని కళ్ళలోని ఎఱ్ఱచారలు రంగనాయకికి ఆనందాన్ని కలిగించటానికి బదులుగా భయపెట్టాయి.

సమాధానం చెపుతున్నపుడు కొంచెం తడుముకోవలసి వచ్చింది-


"అయితే, రోజూ మీరే రండి!" అంది నవ్వుతూనే....

"అలాకాదు-నువ్వేనాతో ఉండిపో!" రంగనాయకి భుజాలు గుచ్చిపట్టి గట్టిగా అదుముకుంటూ అన్నాడు. రంగనాయకికి ఊపిరాడలేదు - అతి ప్రయాసతో అతడి కౌగిలి విడిపించుకొని, ఆయాసపడుతూ "అమ్మనడగండి!" అంది.

అమ్మ అంటే నాగమణి-

"నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను!" మహోద్రేకంగా అన్నాడు- ఈ మాటలు రంగనాయకికి పూర్తిగా కొత్తవి. భయంగా చూసింది. వింతగా ఆలోచించింది- ఏమీ మాట్లాడలేకపోయింది-

శ్రీనాథ్ నాగమణితో మాట్లాడాడు- పదివేలు ఇస్తే రంగనాయకిని శ్రీనాథ్‌తో పంపటానికి ఒప్పుకుంది నాగమణి- శ్రీనాథ్ నాగమణికి పదివేలూ అర్పించు




కున్నాడు- ఈ పరిణామాలన్నీ చకచక ఒకదానివెంట మరొకటి జరిగిపోయి రంగనాయకికి దిగ్భ్రమ కలిగించాయి. జరుగుతున్నది తనకు మంచో చెడో అర్థంకాలేదు. ప్రేమగురించీ పెళ్ళి గురించీ రంగనాయకి పుస్తకాలలో చదివింది- నాగమణి పుస్తకాలు తెప్పిస్తుంది కాలక్షేపానికి! పెళ్ళయ్యాక జీవితం ఎలా వుంటుందో రంగనాయకి ఊహకందలేదు- ఎందుకంటే, అప్పటివరకూ రంగనాయకి చదివిన నవలలన్నింటిలోనూ పెళ్ళితో నవల పూర్తయిపోయేది- పైగా, ఆ నవలలూ జీవితమూ ఒకటేనా? ఏమో!

అక్కడి తన స్నేహితులనందరినీ వదిలి శ్రీనాథ్‌తో వెళ్ళాలంటే ఏడుపు వొచ్చేసింది రంగనాయకికి. మిగిలిన అమ్మాయిలూ అలాగే ఏడ్చారు వాళ్ళంతా అక్కా- చెల్లెళ్ళలాగ గడిపారు- మనసుతో నిమిత్తంలేకుండా. ఎవడినంటే వాడిని ఆనందింపచెయ్యవలసిరావటమే, వాళ్ళకు అపరిమితంగా చికాకు కలిగించే విషయం. దానికి కూడా ఒక విధంగా యాంత్రికంగా అలవాటుపడిపోయారు.

"నాతో రావటం అదృష్టమని మురిసిపోవటానికి బదులుగా ఇలా ఏడుస్తావేం?" అని కసురుకున్నాడు, శ్రీనాథ్. బిత్తరపోయింది రంగనాయకి. అప్పటివరకూ, మొగవాళ్ళు తనతో అలా కసురుకున్నట్టు మాట్లాడటం ఆ అమ్మాయికి అలవాటు లేదు. అదే శ్రీకారం, రంగనాయకికి, శ్రీనాథ్‌తో జీవితానికి - రంగనాయకిని తనతో తన క్వార్టర్‌కి తీసుకెళ్ళాడు శ్రీనాథ్-ఊరికి దూరంగా ఉన్నాయి ఆ క్వార్టర్స్- ఏదో అడవిలోకి అడుగుపెడుతున్నట్టుగా అనిపించింది రంగనాయకికి. అన్ని క్వార్టర్సు ఒక్కలాగే ఉన్నాయి - ముందు కొద్దిపాటి కాంపౌండూ, చిన్న బాల్కనీ, హాలు, బెడ్‌రూం - డ్రాయింగ్ రూమూ, కిచెన్, డైనింగ్ హాలు- ఇల్లు బాగానే ఉంది- ఇంట్లో అడుగుపెట్టగానే, "అబ్బ! ఇన్నాళ్లూ ఆ మెస్‌లో తినలేక చచ్చాను. ఇంకహాయిగా ఇంటిభోజనం చెయ్యొచ్చు" అన్నాడు శ్రీనాథ్. హడలిపోయింది రంగనాయకి- ఆమెకి వంటచెయ్యటం చేతకాదు —— నాగమణి దగ్గిర వంట చెయ్యవలసిన అవసరం రాలేదు. అందరికీ కలిసి వండిపెట్టడానికి వంటవాడు ఉండేవాడు- ఆ రాత్రి శ్రీధర్ ఎంతో దర్పంగా "స్థలం కొని, ఇల్లు కట్టాలని పదివేలు అతికష్టంమీద పోగుచేశాను- ఆ డబ్బంతా నీకోసం త్యాగం చేసాను - చూసావా?" అన్నాడు.

అందులో "త్యాగం" ఏమిటో రంగనాయకికి అర్థంకాలేదు. "ఎవ

డియ్యమన్నాడు?" అని అడగాలను కుంది. ఏదో ప్రేరణ అలా అనకూడదని తోపింపజెయ్యగా మౌనం వహించింది. ఆ మరునాడు తోచినట్లు ఏదో వంట చెయ్యటానికి ప్రయత్నించింది. అతడి షైముకి కాలేదు. అయినా కొంచెం కూడా రుచి కుదరలేదు. "ఛ! ఛ! ఇదేం వంట? ఇంతకంటె మెస్సే పదిరెట్లు బాగుంటుంది! అవునులే!, వంటా వార్పూ నీకెలా వస్తుంది?" అన్నాడు, వెటకారమూ, ఈసడింపూ, చికాకూ, అన్నీ రంగరించి - ఈ చికాకులూ, వెటకారాలూ, అన్నీ రంగనాయకి మనసును మండిస్తున్నాయి. అక్కడి నుంచి పారిపోవాలనిపించింది - ఎక్కడికి పోవాలి! చిన్న పిల్ల — రెక్కల గౌను - ప్రేమగా అన్నం తినిపించే పెద్దావిడ! అదంతా ఏ లోకం? ఆ లోకంలోకి ఎలా పోగలదు తను?

ఆ రాత్రి అతడే దగ్గర కూచుని వంటచెయ్యటం నేర్పించాడు - ఎలాగో చేసింది - కాయగూరలు తరిగి గంట్లు పడిన చేతి వేళ్ళను చూసుకుంది. బాధ తోచింది - ఆ రోజు కూడా తను చేసిన "త్యాగం" గురించి గుర్తు చెయ్యటం మరిచిపోలేదు శ్రీనాథ్.

ఒక రోజు ఊరికే వీధిగుమ్మంలో నిలబడి చుట్టూ చూస్తోంది. శ్రీనాథ్ వచ్చాడు - చాచి చెంపమీద ఛెళ్ళున కొట్టాడు. కళ్ళు చీకట్లు కమ్మాయి. ఏం జరుగుతోందో కూడా తెలియలేదు. "గుమ్మంలో నిలబడి ఏంచేస్తున్నావే! ఇక్కడ కూడా వెధవ వేషాలు వేద్దామనుకున్నావా? ఇంకోసారి బయట కనపడ్డావంటే ప్రాణాలు తీస్తా ను-" అన్నాడు -

చెంప దెబ్బ తినటం, అదే మొదటిసారి రంగనాయకికి — ఉక్రోషంతో ఏడుస్తూ "నన్నెందుకు కొట్టావు? నేనంటే ఇష్టంలేకపోతే పంపించెయ్యి" అనేసింది -

"ఓహో! అంతవరకూ వచ్చిందా వ్యవహారం? ఎక్కడకు పోతావే! నా పది వేలూ నాకు పారేసి పో! ఎక్కడికి పోతావో!" అన్నాడు -

"నన్ను అమ్మ దగ్గిరకి తీసుకుపో! అమ్మనడిగి ఇచ్చేస్తా, నీ డబ్బు నీకు!"

"అదీ సంగతి! తిరగ నేర్చినదానివి నీకు కుదురెక్కడినుంచి వస్తుందే! కనకపు సింహాసనంమీద శునకాన్ని కూచోబెడితే మాత్రం వెనుకటి బుద్ధులు పోతాయా? నీ కసలు నా మీద ప్రేమ లేదు - మీ జాతికి ప్రేమంటే ఏమిటో కూడా తెలుసూ?"

ఇలా సాధించి సాధించి మాటలతో మనసు కుళ్ళబొడిచి కుళ్ళబొడిచి, చివరకు దగ్గిరకు తీసుకోబోయాడు. రోషంతో చేతులు విదిలించి కొట్టింది. "వెధవ్వేషాలెయ్యకు - నోరు సుమూకుని రా!" అని బలవంతాన మీదకి లాక్కున్నాడు.

అప్పటినుంచీ, పాపం, రంగనాయకి వీధిలోకి రాకుండా జాగ్రత్త పడసాగింది.


ఒక స్టీల్‌ఫాక్టరీ నిర్మాణం కోసం అక్కడ పనిచేస్తున్నాడు శ్రీనాథ్ - ఫాక్టరీ నిర్మాణం పూర్తయింది.

"పద! మనం వూరికి పోదాం!" అన్నాడు సామానులు సర్దు తూ.... అక్కడ తనకోసం భయంకరమయిన స్వాగతం ఎదురుచూస్తోందని తెలియని రంగనాయకి అడవిలోంచి వూళ్ళోకి వస్తున్నానుకదా, అని వుత్సాహంగా బయలుదేరింది - ఇంట్లోకి అడుగు పెట్టకుండానే అర్థమయిపోయింది రంగనాయకికి. అతడికి భార్యా, ఇద్దరు పిల్లలూ వున్నారని - అతడి భార్య రంగనాయకి మీద భద్రకాళిలా విరుచుకుపడింది - ఇరుగూ పొరుగూ పోగయ్యారు. రంగనాయకిని కుతూహలంగా వింతజంతువుని చూసినట్లు చూసారు - వణికిపోతూ ఒక వారకి నిలబడడం తప్ప ఏమీ చెయ్యలేకపోయింది రంగనాయకి.

కొద్ది రోజులు భార్య దగ్గిరలేనంత మాత్రాన మరొక స్త్రీని వెంట తెచ్చుకున్న ఆ పురుష పుంగవుణ్ణి భార్య కానీ, చుట్టుపక్కలవారు కాని, ఏమీ అనటంలేదు. విధిలేక బానిసలా అమ్ముడుపోయి, బలిపశువులా అతని వెంట వచ్చిన రంగనాయకిని మాత్రం అందరూ నోటికొచ్చినట్లువిందిస్తున్నారు. శ్రీనాథ్ అసలు అక్కడ లేదు. భార్య నోటికి భయపడి చల్లగా బయటికి జారుకున్నాడు. ఆ రోజంతా ఎవరెవరో రావటం, ప్రతి ఒక్కరి దగ్గరా భార్య తన కథంతా చెప్పుకుని ఏడవటం, వాళ్ళు భార్యను ఓదారుస్తూ, రంగనాయకిని అసహ్యంగా చూడటం - అలా జరిగిపోయింది - పాపం, రంగనాయకికి తిండీ తిప్పలూ కూడా లేవు - ఎప్పుడో రహస్యంగా శ్రీనాథ్ నాలుగు ఇడ్లీల పొట్లాం తెచ్చి ఎవరూ చూడకుండా రంగనాయకి వళ్ళో పడేసాడు - మరచెంబుతో మంచినీళ్ళు కూడా అతడే పెట్టాడు - ఆ రాత్రి అతడి భార్య ఏడవటం - అతను బ్రతిమాలటం - ఆవిడ ఏదో అనటం, ఇతడు 'ఊ' అనటం అన్నీ రంగనాయకికి వినిపిస్తూనే ఉన్నాయి. అక్కడే నేలమీద కొంగు పరచుకుని పడుకుంది.

"ఏం చెయ్యాలి?" అనే ఆలోచనతో ఆ అభాగ్యురాలి మస్తిష్కం మరిగిపోసాగింది. రెండురోజుల్లోనే రంగనాయకికి వేరే ఇల్లుచూసి అక్కడ ఉంచాడు శ్రీనాథ్ - రంగనాయకి "హమ్మయ్య" అనుకున్నంతసేపు పట్టలేదు. మరో కొత్త సమస్య ప్రారంభం కావటానికి. రంగనాయకిని వేరే ఇంట్లో దించగానే, అక్కడికి శ్రీనాథ్ మావయ్య రావటం ప్రారంభించాడు.

ఏదో వంకన— శ్రీనాథ్ అతడిని ఏమీ అనలేకపోయాడు - శ్రీనాథ్‌కి ఉద్యోగం ఇప్పించింది అతడే! ఇటు డబ్బూ, అటు పలుకుబడీ ఉన్నవాడు - అంచేత రంగనాయకినే సతాయించటం ప్రారంభించాడు. పాపం, రంగనాయకి ఆ మావయ్యని రావద్దని బ్రతిమాలింది. అతడు రావటం మానలేదు, సరికదా, వెకిలిమాటలు ప్రారంభించాడు — "ఆ వెధవని వదిలేసి నాతో వచ్చెయ్యి" అనటం మొదలుపెట్టాడు. ఇటు మావయ్య గోల! అటు శ్రీనాథ్ సతాయింపులు అప్పుడప్పుడు చావు దెబ్బలు! ఈ బాధంతా పడలేక ఒకసారి తెగించి శ్రీనాథ్ లేనిసమయంలో పారిపోవటానికి ప్రయత్నించింది. పనీ పాటా లేక ఎప్పుడూ ఒక కన్ను రంగనాయకి మీద వేసిఉంచిన శ్రీనాథ్ మావయ్య వెంటనే రంగనాయకిని దారిలోనే పట్టుకుని బలవంతాన ఇంటి కీడ్చుకొచ్చి ఆ సంగతి శ్రీనాథ్‌కి చెప్పాడు-చిత్రంగా అప్పుడు మావా, అల్లుడూ ఒకటైపోయారు - శ్రీనాథ్ రంగనాయకిని చావబాదాడు.



ఈ చిత్రహింసలు భరించలేకపోయింది రంగనాయకి. ఆమెకు బయటపడే దారి కనిపించలేచు. చివరకు మునసలాడిని మంచిచేసుకుని అతడి ద్వారానే బయటపడాలనుకుంది.

ఒకరోజు శ్రీనాథ్ రంగనాయకి దగ్గరకు వచ్చేసరికి రంగనాయకీ, మావయ్యా నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ కనిపించారు. మావయ్య తెచ్చిన ఫలహారాలు కూడా కనిపించాయి. మండిపోయాడు శ్రీనాథ్ - అతడిని చూడగానే మావయ్య వెళ్ళిపోయాడు. శ్రీనాథ్ కొడతాడనుకుంది రంగనాయకి. భయపడకుండా నిర్లక్ష్యంగా మొండిగా నిలబడింది. ఆ వైఖరి శ్రీనాథ్‌ని పిచ్చివాడిని చేసింది - వంటింట్లోంచి కిరసనాయిలు తెచ్చి మీద గుమ్మరించి అగ్గిపుల్ల గీసేశాడు - భయంతో అరుస్తూ అటూ ఇటూ పరుగెత్తింది రంగనాయకి. మంటలు మరింత ప్రజ్వరిల్లాయి. ఆమె అరుపులకు చుట్టుపక్కలవాళ్ళు పోగయ్యారు-పోలీసులు వచ్చారు - వాళ్ళంతా కాలినరంగనాయకిని ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి వరకూ మనసులో అణచుకున్న క్షోభనంతా మరణవాఙ్మూలంలో బయటపెట్టింది రంగనాయకి. నాలుగు రోజులు నరకయాతన అనుభవించి కన్ను మూసింది. వంటిమీద తెలివి లేనప్పుడు "చిన్నపిల్ల.... రెక్కలగౌను మేడ మెట్లు....డప్పులు.... చీకటి...." అంటూ ఏదేదో కలవరించిందనీ, ఆ కలవరింతలకు అర్థం తెలియలేదనీ చెప్పుతున్నారు.

శ్రీనాథ్‌ని అరెస్ట్ చేశారు - రంగనాయకి ఆత్మహత్య చేసుకుందని శ్రీనాథ్ వాదించాడు. కానీ చుట్టుపక్కల వాళ్ళ సాక్ష్యాలూ, ముఖ్యంగా రంగనాయకి మరణవాఙ్మూలమూ ఆధారంగా అతడిని దోషిగా నిర్ణయించారు.

* * *

"మంటలు! మంటలు! హమ్మనాయనోయ్ మంటలు! కాల్చేస్తున్నాయి మంటలు!"

అరుస్తున్నాడు ఖైదీ నం. 117. అవును ఆ మంటలు ఆరేవి కావు! ఇంకా ఈ సభ్య సమాజంలో ఎక్కడెక్కడ ఎలాంటి మంటలు మండుతున్నాయో! అవి ఆరేదెన్నటికో.

———